
నూరేళ్ళ తెలుగు కథకు నవ్య నీరాజనం-64



# డబ్బుకోసం నేనెప్పుడూ కథలు రాయలేదు!

**- అంగర సూర్యారావు**

కథకునిగా, నాటక రచయితగా, చరిత్రకారునిగా నిరంతరం కథన కుతూహలంతో తెలుగు సాహితీ ప్రక్రియల్ని అంగరంగ వైభవంగా ఆవిష్కరిస్తున్న సాహిత్యమూర్తి అంగర సూర్యారావు. తొలినాళ్లలో ఈయన రాసిన కథలు ఆనాటి సమాజానికి దర్పణాలు. అనంతరం రాసిన నాటికలు, నాటకాలు సుషుప్తిలో ఉన్న జనానికి మేలుకొలుపులు. రచన ఏదైనా దాని ప్రయోజనం సమాజ హితం అని భావించే సూర్యారావు వెయ్యేళ్ల విశాఖ చరిత్రను భావితరాల వారికి అందించాలన్న దీక్షలో ప్రస్తుతం ఉన్నారు. అలుపెరగని అక్షరసేద్యం చేస్తున్న 83 ఏళ్ల సాహితీ యాత్రికుడు అంగర సూర్యారావుగారితో ఇంటర్వ్యూ ఈ వారం..

## యుద్ధ వాతావరణంలో జీవిత అధ్యయనం

తూర్పు గోదావరి జిల్లా మండపేటలో 1927 జులై 4న నాగన్న, వీరమ్మ దంపతులకు పుట్టాను. 1939లో సంభవించిన రెండో ప్రపంచయుద్ధం నా 12 ఏళ్ల వయస్సులోనే జీవిత అధ్యయనాన్ని నేర్పింది. అక్కడి నుంచే చదవడం అలవాటయింది. నిత్యావసర వస్తువులు సామాన్యులకు అందక యుద్ధరంగంలో వారికి చేరడంతో అన్ని వస్తువులతో పాటు కాగితానికీ కరువు ఏర్పడడం నన్ను ఆశ్చర్యపరచింది. ఆంగ్లేయుల పాలనలో అంతంత మాత్రంగా ఉన్న స్కూళ్లలో నా చదువు ఎస్సెస్సెల్సీతోనే ఆగిపోయింది. పాఠశాల చదువు ఆగింది కనుక అందుబాటులో ఉన్న పత్రికా పఠనం ప్రారంభమయింది. మద్రాసు కేంద్రంగా అచ్చయ్యే అన్ని పుస్తకాలు మండపేట మెయిన్ రోడ్‌లో మేం నడుపుతున్న కూల్‌డ్రింక్ షాపులో వేలాడుతుండేవి. 1940 ప్రాంతాల్లో ఆంధ్రపత్రికలో గ్రాంధిక భాషలో వచ్చిన వేలూరి శివరామ శాస్త్రిగారి 'ఒకే చీర' కథ ఇప్పటికీ నాకు గుర్తుంది.


భార్య పద్మావతితో...

## సినిమా పత్రికలకు ఉత్తరాలు రాయడం కాలక్షేపం

ఆ రోజుల్లో చాలామంది థర్డ్‌ఫారమ్‌తోనే చదువులు మానేసి వారి వారి వృత్తుల్లో ప్రవేశించేవారు. నా స్నేహితుల్లో చాలామంది సంపన్న కుటుంబాలకు చెందిన వారు. నాతో పాటు వారు కూడా ఖాళీగా ఉంటూ సినిమా పత్రికలు చదువుతూ వాటికి ఉత్తరాలు రాస్తూ కాలక్షేపం చేసేవారు.

## రచనలకు ముందే డైరీ రాయడం అలవాటైంది

1944లో నేను రామచంద్రాపురం బోర్డు నేషనల్ స్కూల్లో ఫోర్తు ఫారమ్ చదువుతున్నప్పుడు ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి గారు మా తెలుగు పండితులు. స్థానికంగా ఉన్న రచయితల తోడ్పాటుతో 1946 డిసెంబర్‌లో ఆంధ్రాభ్యుదయోత్సవాలు జరిపించారు. అప్పటి ప్రముఖ కవులు, రచయితలు దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు వంటి వారు ఆ సభల్లో పాల్గొన్నారు. ఆ అనుభవాల్ని చిరస్థాయిగా నా మనసులో నిలుపుకోవాలని ఆనాటి నుంచి డైరీ రాయడం ప్రారంభించాను. ఈనాటి వరకూ విడవకుండా డైరీ రాస్తూనే ఉన్నాను.

## తొలి రచన 'చందమామ'లో..

పురాణ గ్రంథాలు మినహా మా ఊళ్లో ఉన్న లైబ్రరీలోని అన్ని పుస్తకాలు ఇంచుమించుగా చదివాను. త్రిపురనేని రామస్వామి చౌదరి రచనలతో హేతువాదం గురించి తొలిసారిగా తెలుసుకొన్నాను. అక్కడే 'భారతి' సాహిత్య మాసపత్రిక పాత సంచికలు బైండ్ చేసి భద్రపరచి ఉండేవి. వాటిల్లో పద్యాలు చదివిన తరువాత మాత్రాఛందస్సుపై మనసు మళ్లింది. ముత్యాలసరాలతో గేయాలు రాయడం నేర్చుకున్నాను. 1947లో కొత్తగా వచ్చిన బాలల మాసపత్రిక 'చందమామ'కు చిన్న గేయం రాసి 'కిరణ్' అన్న కలం పేరుతో పంపాను. రెండో సంచికలోనో, మూడో సంచికలోనో ఆ గేయాన్ని ప్రచురించారు. ఆ సంవత్సరమే, తొలి కథను రాసి 'వినోదిని' మాసపత్రికకు పంపాను. అదీ అచ్చుకావడంతో నాలో రచనా వ్యాసంగంపై ఉత్సాహం పెరిగింది. అప్పటి నుంచి కథలూ, వ్యాసాలూ విరివిగా రాయడం మొదలుపెట్టాను. అవి చిత్రగుప్త, చిత్రాంగి, ఆనందవాణి పత్రికల్లో అచ్చయ్యాయి. 1948లో 'తెలుగు స్వతంత్ర' వారపత్రిక ప్రారంభమయింది. అందులో నా రచనలు ఎక్కువ అచ్చుకావడంతో అప్పటి నుంచి క్రమం తప్పకుండా చిన్నపెద్ద కథలు, వ్యాసాలు చాలానే రాశాను.

## బతుకు తెరువు కోసం విశాఖ వచ్చాను

ఇటు రచనా వ్యాసంగం కొనసాగిస్తూనే అటు బతుకు తెరువు కోసం ప్రయత్నాలు ప్రారంభించాను. 1948లో మద్రాసు వెళ్లి పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాశాను. 1949లో ఎంపిక కావడంతో మార్చి 16న విశాఖపట్నం వచ్చి విద్యాశాఖలో గుమాస్తాగా చేరాను.

## 'విశాఖ జిల్లా రచయితల సంఘం' పేరు మార్చాను

ఉద్యోగంలో చేరిన తొలి వారంలోనే హిందూ రీడింగ్ రూమ్‌లో సభ్యత్వం తీసుకున్నాను. అక్కడే కొంతమంది ప్రముఖ రచయితలతో పరిచయాలయ్యాయి. 'మసూనా' మరి కొంతమంది కలసి అప్పటికే 'విశాఖ జిల్లా రచయితల సంఘం' ఏర్పాటు చేసి ఉన్నారు. అందులో కూడా సభ్యుణ్ణి అయ్యాను. సంఘం ఆధ్వర్యంలో సభలు, సమావేశాలు చాలా నిర్వహించాం. రోజు రోజుకూ రచయితల సంఖ్య పెరిగింది. ఆ రోజుల్లో రాయలసీమ మినహా అన్ని జిల్లాల విద్యార్థులు విశాఖ వచ్చి ఆంధ్రా యూనివర్శిటీలో చేరేవారు. వారిలో చాలామంది రచయితలు కూడా ఉన్నారు. వారంతా మా రచయితల సంఘం నిర్వహిస్తున్న సభల్లో పాల్గొనేవారు. సభ్యులుగా చేరేవారు. 'అన్ని జిల్లాలకు చెందిన రచయితలు సభ్యులుగా చేరారు గనుక, మన సంఘంలో 'జిల్లా' అన్న పదం తొలగిద్దాం' అని నేను చేసిన సూచనను సభ్యులతో పాటు రచయితలందరూ అంగీకరించారు. 'జిల్లా' అన్న పదం తొలగించి 'విశాఖ రచయితల సంఘం' అన్న పేరుతోనే 1952 నుంచి పెద్ద ఎత్తున సభా కార్యక్రమాలు నిర్వహించాం.

## డబ్బుకోసం ఎప్పుడూ రాయలేదు

తొలి రోజుల్లో కథలూ, స్కెచ్‌లు, వ్యాసాలు చాలా రాశాను. ఆ రోజుల్లో చాలా పత్రికలు రచనలకు పారితోషికాలు ఇచ్చేవి కావు. నేను డబ్బుకోసం ఎన్నడూ రచనలు చేయలేదు కనుక నాకెప్పుడూ బాధ అనిపించలేదు. పైగా

## నచ్చినవి

| | | |
|---|---|---|
| సినిమా | : | మల్లీశ్వరి (బి.ఎన్.రెడ్డి) |
| హీరో | : | నారాయణరావు |
| హీరోయిన్ | : | కాంచనమాల |
| సంగీత దర్శకుడు | : | సాలూరి రాజేశ్వరరావు |
| గాయని | : | ఎం.ఎస్.సుబ్బులక్ష్మి |
| గాయకుడు | : | జేసుదాసు |
| ఆహారం | : | శాకాహారం |
| నవల | : | మాలపల్లి |
| కథకుడు | : | కొడవటిగంటి కుటుంబరావు |
| స్నేహితులు | : | రాచకొండ విశ్వనాథ శాస్త్రి |
| | | బలివాడ కాంతారావు |
| | | కాళీపట్నం రామారావు |
| సినిమా పాటలు | : | తెలుగు వీర లేవరా.. |
| కవి | : | త్రిపురనేని రామస్వామి చౌదరి |
| నాటకం | : | ప్రతాపరుద్రీయం |

కథలు, స్కెచ్‌లు రాయడం నాకు చాలా తేలిక అనిపించేది. వాటికోసం పెద్దగా కష్టపడలేదు కనుక డబ్బులు ఆశించలేదు. ఏ పత్రిక అయినా పారితోషికం పంపితే తీసుకున్నాను తప్ప ఇవ్వకపోతే ఎవరినీ అడిగేవాణ్ణి కాదు. నా రచన తిప్పి పంపినా పెద్దగా బాధపడేవాణ్ణి కాదు.

### తొలి పారితోషికంతో డిక్షనరీ కొన్నాను


1949లోనో 1950లోనో సరిగా గుర్తు లేదు. నా రచనకు తొలిసారిగా ధనికొండ హనుమంతరావు గారు పారితోషికం పంపారు. ఆ పదిరూపాయలతో 'ఛాంబర్స్ ట్వంటీయత్ సెంచరీ' డిక్షనరీ కొన్నాను. 1260 పేజీల ఆ ఇంగ్లీషు డిక్షనరీ ఇప్పటికీ నా దగ్గర పదిలంగా ఉంది.

### కథల పోటీనుంచి తప్పుకున్నాం

విశాఖ రచయితల సంఘంలో సీనియర్ రచయితలు పత్రికలు ప్రకటించే కథల పోటీల్లో పాల్గొనకూడదనీ, యువరచయితలు, వర్ధమాన రచయితలకే ఆ అవకాశాన్ని విడిచి పెట్టాలని నిర్ణయించుకున్నాం. బలివాడ కాంతారావు, కాళీపట్నం రామారావు, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, నేనూ మరికొందరం సీనియర్ రచయితలం పత్రికలు నిర్వహించే పోటీలకు కథలు పంపలేదు. 1988లో ఒక తమాషా జరిగింది. నేను విద్యాశాఖలో పని చేస్తున్నాను కాబట్టి ఏజన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో జరుగుతున్న అవినీతిని చిత్రిస్తూ 'అడవి గోల' అన్న కథ రాసి ఆంధ్రజ్యోతి వారపత్రికకు పంపాను. సరిగ్గా అప్పుడే 'అమెరికా ఆంధ్ర సంఘం' వారు ఆంధ్రజ్యోతి ద్వారా కథల పోటీ నిర్వహించారు. నా కథ పొరబాటున ఆ పోటీ కథలలో చేరిందో, లేక అప్పటి సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మ కావాలని ఆ కథను ఆ పోటీలో చేర్చారో తెలీదు. పోటీ కథల ఫలితాల ప్రకటన చదివితే అందులో నా కథకు రెండో బహుమతి వచ్చింది. అది చూసి మా రచయితల సంఘంలోని ఓ మిత్రుడు 'మీ కథను పోటీలో పెట్టడమేమిటి? ప్రొటెస్ట్ చేయండి' అని అన్నాడు. దాని వల్ల ఎడిటర్‌ను ఇరుకున పెట్టడం తప్ప ప్రయోజనం ఏమీ ఉండదని అతనికి నచ్చచెప్పి ఊరుకున్నాను.

### కథ కంటే నాటిక రాయడం కష్టం

నా దృష్టిలో కథకంటే నాటిక/నాటకం రాయడం చాలా కష్టం. కథ ఒక పేజీలో రాసినా ఫర్వాలేదు. నాటికకు అలా కుదరదు. రంగస్థలం మీద నాటిక ప్రదర్శన 45 నిమిషాలు ఉండాలి. సమాజానికి సూటిగా సందేశాన్ని ఇవ్వగలిగే శక్తి నాటకానికి ఉంది. నేను 1953 నుంచి నాటికలు, నాటకాలు రాశాను. అవి భారతి మాసపత్రికలోను, ఆంధ్ర సచిత్ర వారపత్రికలోనూ అచ్చయ్యాయి. ఎన్నో నాటక సంస్థలు, సమాజాలు నేను రాసిన నాటక, నాటికలను ఆంధ్రరాష్ట్రంలోనే కాక ఇతర రాష్ట్రాలలోనూ ప్రదర్శించారు. అందుచేత కథా రచయితగా కంటే నాటక రచయితగానే నాకు ఎక్కువ పేరు వచ్చింది. నాటక రచనకు వీలుగాని మంచి ఇతివృత్తాలు తట్టినప్పుడు వాటిని కథలుగా మలిచేవాణ్ణి. నాటకాలతో పోలిస్తే నేను రాసిన కథల సంఖ్య తక్కువనే చెప్పాలి. నేషనల్ బుక్ ట్రస్ట్ వారు నా నాటిక 'ఒక గంట సంసారం'ను ఇతర భాషలలోకి అనువాదం చేయడానికి ఎంపిక చేశారు. 'చంద్రసేన' నాటకానికి 1978లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.



### పుస్తకాలే పిల్లలు

ప్రఖ్యాత నాటక ప్రయోక్త అత్తిలి కృష్ణారావు అక్క పద్మావతితో 1950 జనవరి 20న నాకు పెళ్లయింది. మాది ప్రేమ వివాహం అయినా పెద్దల అంగీకారంతోనే జరిగింది. అరవై ఏళ్ల వైవాహిక జీవితంలో శ్రీమతి ప్రోత్సాహం, సహకారంతోనే నేను ఇన్ని రచనలు చేయగలిగాను. మాకు సాహిత్యమే లోకం. అచ్చేసిన పుస్తకాలే సంతానం. ఆ ఉత్సాహంతోనే అకుంఠిత దీక్షతో వేయి సంవత్సరాల విశాఖ చరిత్ర రాస్తూ మరుగున పడి ఉన్న ఎన్నో కొత్త సంగతులను ఆవిష్కరించడానికి ఉవ్విళ్లూరుతున్నాను.

### ప్రజల కోసమే రాయాలి

నా దగ్గర చాలా విలువైన గ్రంథాలున్నాయి. వాటిలో అరుదైన సమాచారం ఉంది. అవి భద్రంగా ఉన్నాయి. వాటిని భావి తరాలకు అందించాలన్నదే నా లక్ష్యం. వర్ధమాన కవులకు, రచయితలకు నాదో సూచన.. ఏం రాసినా ప్రజలకోసమే రాయాలి. ఏదైనా అంశంపై అమూలాగ్రం తెలుసుకోకుండా రచనలు చేస్తే మనకి తెలీకుండానే సమాజానికి ఏదో రూపంలో అపకారం జరుగుతుంది. అంతకంటే ఏమీ రాయకపోవడమే మంచిది.

– మేడా మస్తాన్ రెడ్డి

*9441344365*

నాకు నచ్చిన నా కథ

# ఏడడుగుల వ్యాపార బంధం

- అంగర సూర్యారావు

**''అయ్యగారూ!''**

**పిలుపు విని తలపైకెత్తి చూశాడు రామ్మూర్తి. ఆఫీసు వాచ్‌మేన్ గుమ్మం దగ్గర నిలబడి ఉన్నాడు. అర్జంటు పని ఏదైనా వుంటే ఆఫీసరు గారు అతన్ని పంపడం రివాజు. కానీ సూర్యోదయం కాకముందే రావడం ఇదివరకెప్పుడూ జరగలేదు.**

**''ఏమిటి! ఇంకా తెల్లవారకముందే వచ్చావు?''**

**''అమ్మగారు వచ్చారు!''**

**ఇదివరకు తన ఆఫీసుకు ఒక ఉమెన్ ఆఫీసరు వుండేవారు. ఆవిడ ఎందుకైనా ఒకవేళ ఆఫీసుకు వచ్చి కబురు పంపారేమో అనుకుని–**

**''అమ్మగారెవరు?'' అన్నాడు మూర్తి.**

**''మీ భార్యగారు!''**

**ఆ మాట వినగానే కొరడాతో చెళ్లున కొట్టినట్టు అదిరిపడ్డాడు మూర్తి.**

''మీ ఇల్లు తెలియక ఆఫీసుకు వచ్చారు...'' అంటూ చెబుతున్న వాచ్‌మేన్ మాటలు అతనికి వినపడడం లేదు.

తొందరగా లేచి గుమ్మం దగ్గరకి వెళ్లాడు. ఆటో దిగుతున్న సుమతి కనిపించింది. వాచ్‌మేన్ ఆటోలోంచి సామాన్లు దించి లోపల పెట్టి వెళ్లిపోయాడు.

సుమతి లోపల అడుగు పెట్టింది.

''నేను ఇలాగ ఆకస్మికంగా వచ్చినందుకు మీకు కోపం వచ్చిందా? నేను వద్దామనుకోలేదు. నాకీ ఊరు ట్రాన్స్‌ఫర్ అయ్యింది. ఇక్కడ నాకు తెలిసిన వాళ్లెవరూ లేరు. మీకేమీ అభ్యంతరం లేకపోతే రెండు రోజులు ఉండి అద్దె ఇల్లు చూసుకుని వెళ్లిపోతాను'' అంది తలవంచుకుని!

***

జిల్లా హెడ్‌క్వార్టర్సు ఆఫీసులో రామ్మూర్తి మూడేళ్ల నుంచి పని చేస్తున్నాడు. పేరుకు తగ్గట్టే పూర్వకాలపు మనిషి. ముక్కుకు సూటిగా తన పని ఏదో తను చేసుకు వెళ్లిపోతూ వుంటాడు. ఆ ఆఫీసులో వున్న గ్రూపు తగాదాల్లో ఎప్పుడూ తలదూర్చే వాడు కాదు. ఇతరుల విషయాలలో అతను కలగచేసుకోకపోయినా అతని మానాన అతన్ని వదిలి పెట్టలేదు కొందరు. అతను ఎక్కడ వుంటున్నాడు? ఎక్కడికి వెళుతున్నాడు? ఏం చేస్తున్నాడు? వగైరా వివరాలు సేకరిస్తూ వుండేవారు. ఫలానావీధిలో ఫలానాచోట అద్దె యింట్లో వుంటున్నాడని, కుటుంబం లేదని, ఒక్కడే వుంటున్నాడని అతనే స్వయంగా వంట చేసుకుతింటున్నాడని ఆఫీసు టైముకుముందు ఆఫీసు టైమయిన తర్వాత ఎక్కడికీ వెళ్లడం లేదని అటెండర్ల ద్వారా తెలుసుకున్నారు. మంచివాడు. బుద్ధిమంతుడు అనిపేరు పడడంతో ఎవరో పిల్లనివ్వడానికి కూడా వచ్చారు. అప్పుడు తెలిసింది అతనికి పెళ్లయిపోయిందని.

పెళ్లయితే మరి ఒంటరిగా ఎందుకు వుంటున్నాడు? దానికి జవాబు ఎవరికితోచినట్టు వాళ్లు వూహించుకున్నారు. భార్య వదిలేసిందని కొందరన్నారు. ఇతనే భార్యను విడిచి పెట్టేశాడని మరికొందరన్నారు. కొందరు సరాసరి అతనినే అడిగారు. కానీ జవాబు రాబట్టుకోలేక పోయారు.

మూడేళ్ల తర్వాత యిప్పుడు అతని భార్య వచ్చిందన్న వార్త క్షణాల మీద వ్యాపించింది. ఆవేళ రామ్మూర్తి సెలవు పెట్టేస్తాడనుకున్నారు. కానీ ఒక్క క్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా అతను రోజులాగే కరెక్టు టైముకు ఆఫీసుకు వచ్చాడు. కొందరు చనువు తీసుకుని కుతూహలం కొద్దీ ప్రశ్నలు వేశారు. భార్య వచ్చిందన్న సంగతి మాత్రం ఒప్పుకున్నాడు. మిగతా ప్రశ్నలకు సమాధానం యివ్వకుండా తప్పించుకున్నాడు. భార్య వచ్చిందన్న ఆత్రంగానీ, ఇంటికి కావలసినవి కొనుక్కు తీసుకువెళ్లాలన్న ఆదుర్దాగానీ అతనిలో కనపడలేదు. ఆఫీసు పని పూర్తయిన తర్వాత ఎప్పటి లాగా తీరికగా ఇంటికి వెళ్లాడు.

తాళం తీసి యింట్లో అడుగుపెట్టాడు. టేబులు మీద పేపరు వెయిట్ కింద బాగా కనిపించేలాగ ఒక చీటి వుంది. తీసి చదివాడు.

''కొత్తగా చేరుతున్నరోజు. ఈ ఆఫీసు గురించి తెలియదు. ఒకవేళ ఆలస్యం అవుతుందేమో! మీరు వంట చెయ్యకండి నేను వచ్చి చేస్తాను – సుమతి''.

అతని ముఖంలో బాధ, కోపం కనిపించాయి. గతాన్ని మరచిపోయి ప్రశాంతంగా జీవితం గడుపుతున్న సమయంలో ఈమె తిరిగి యిప్పుడు రావడం ఏమిటి?

బట్టలు మార్చుకొని వంటగదిలోకి వెళ్లాడు. సుమతి భార్య హోదాలో ఆ యింట్లో ప్రవేశించడమే కాక వంటగదిలోకి వెళ్లి తన అనుమతి తీసుకోకుండానే ఉదయం చకచకా వంటచేసేసింది. వడ్డించింది. రక రకాల ఆలోచనలు అతనిని ఉక్కిరి బిక్కిరిచేసినా పైకి ఒక్క మాట కూడా అనలేకపోయాడు. తలవంచుకుని భోజనం చేసి ఆఫీసుకు వెళ్లిపోయాడు.

వంటగదిలో అన్నీ జాగ్రత్తగా సర్ది వున్నాయి. పొద్దున్న వండిన కూరలు వగైరా వున్నాయి. అన్నం ఒకటీ వండితే సరిపోతుంది. గిన్నె తీశాడు. పరధ్యానంగా ఎప్పటిలాగ తనకు ఒక్కడికి సరిపోయేలాగ బియ్యం పోశాడు. అప్పుడు గుర్తు వచ్చింది. ఒక్క క్షణం ఆలోచించి ఆమెకు కూడా బియ్యం వేశాడు. అన్నం వండి వార్చి కూర్చున్నాడు.

పుస్తకం తీశాడు. కానీ చదవలేక పోయాడు. కొత్తగా వచ్చిన యీ ఆపద నుంచి తప్పించుకోవడం ఎలాగ? ఆమెను వెళ్లిపోమనిచెప్పలేక పోయాడు. ఉండమనీ అనలేడు. అతనూ, ఆమే కలిసి వున్నది కేవలం మూడురోజులు మాత్రమే. అయినా అతని తత్వం పూర్తిగా తెలిసిన దాని లాగ ఆమె అతని అనుమతి కోసం ఎదురు చూడకుండా తను అనుకున్న పని తానుచేసి ఉదయం తన ఆఫీసుకు వెళ్లి

పోయింది. ఆ సాయంత్రం ఆమె తిరిగి వచ్చేసరికి ఆరున్నర దాటి పోయింది.

పుస్తకం పట్టుకొని టేబులు ముందు కూర్చున్న రామ్మూర్తిని చూసింది. హేండ్ బ్యాగ్ తెరచి ఒక కవరు తీసి అతని ముందు పెట్టి ''చూడండి!'' అని అతని జవాబుకోసం ఎదురు చూడకుండా పెరట్లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత కొంతసేపటికి ముఖం తుడుచుకుంటూ వంటింట్లోకి వెళ్లింది.

అన్నీ సర్దుకున్న తర్వాత ''రండి! వడ్డించాను!'' అంది.

అతను మౌనంగా లేచి వెళ్లి కూర్చున్నాడు. భోజనం చేసి తిరిగి గదిలోకి వెళ్లిపోయాడు. అతను వెళ్లిన తర్వాత ఆమె భోజనానికి కూర్చుంది.

వంటగది చక్కబెట్టుకుని వచ్చేసరికి ఎనిమిదిన్నర దాటింది. రామ్మూర్తి అద్దెకు వుంటున్న భాగంలో ఒక గది. ఒక వంట గది. దాని వెనక చిన్న వరండా, దానికి చేర్చి బాత్రూం ఉన్నాయి.

ఆ గదిలో ఒక పక్కని చాప పరుచుకొని తీరిగ్గా కూర్చుని తన సూట్‌కేసు తెరచి సర్దుకుంటోందామె!

''నీకు యివ్వవలసిన డబ్బు యింకా సర్దుబాటు కాలేదు. పది వేలు కూడ బెట్టగలిగాను. కావాలంటే ఆ డబ్బు యిస్తాను''.

ఆమాట వినగానే ఆమె చివాలున తలపైకెత్తి చూసింది. రామ్మూర్తి గోడ వైపు ముఖం తిప్పుకు కూర్చున్నాడు.

''నేను డబ్బుకోసం రాలేదు. మీరు అలాగ అనుకుంటారనే ఆ కవరు యిచ్చాను. అందులో నా ట్రాన్స్‌ఫర్ ఆర్డరు చూడలేదా?'' అంది.

''చూశాను''.

''నాకు ప్రమోషన్ యిచ్చి ఈ వూరు బదిలీ చేశారు. నేను చేరిన తేదీ నుంచి ప్రమోషన్ అమలులోకి వస్తుందని అందరూ తొందరపెడితే ఆలస్యం చెయ్యకుండా వెంటనే బయలుదేరి వచ్చాను''.

''నువ్వు మా ఆఫీసుకు వెళ్లకుండా వుండవలసింది''.

''నేనూ అలాగే అనుకున్నాను. కానీ నాకీ ఊళ్లో ఎవరూ తెలియదు'' అంది.

అతను మాట్లాడలేదు.

ఆమె తిరిగి అంది. ''వాచ్‌మన్ అడిగాడు మీరేమౌతారని. చెప్పక తప్పలేదు''.


ఔను! చట్టరీత్యా ఆమె తనకు భార్య. విడాకులు పుచ్చుకొనే వరకూ ఆ హోదా మారదు అనుకున్నాడు.

ఆరోజు ఉదయం ఆమె ఆ యింట్లో అడుగు పెట్టినప్పటి నుంచీ అతనికి మనశ్శాంతి లేకుండా పోయింది. మరుగున పడిపోతున్న గతం సుమతి రూపంలో తిరిగి అతని ముందుకు వచ్చి నిలబడింది.

***

మధ్యతరగతి అనడానికి కూడా వీలులేని ఒక నిరుపేద కుటుంబం లోంచి వచ్చాడు రామ్మూర్తి. పెద్దలు సంపాదించిన ఆస్తి పూచిక పుల్ల కూడా లేదు. అతని తండ్రి ఆ వూళ్లో షాపులలో పద్దులు రాస్తూ దిన భత్యానికి సరిపోయే డబ్బులు తెచ్చేవాడు. అతనికి వున్న ఇద్దరు సంతానంలో రామ్మూర్తి పెద్దవాడు. రెండోది ఆడపిల్ల. రామ్మూర్తిని మెట్రిక్యులేషన్ వరకు చదివించగలిగాడు తండ్రి. ఆ తర్వాత రామ్మూర్తి తనంతట తానే శ్రమపడి చిన్న ఉద్యోగం సంపాదించుకున్నాడు. అదైనా వున్న వూళ్లోకాదు. అతనికి చిన్నప్పటినుంచీ వంట చెయ్యడంలో అనుభవం వుంది. ఆ అనుభవం అతనికి తర్వాత పనికి వచ్చింది.

రామ్మూర్తికి అందరిలాగ హోటలుకు వెళ్లి భోజనం చెయ్యవలసిన అవసరం



లేకపోయింది. పొదుపుగా వంట చేసుకొని నాలుగు డబ్బులు వెనకేసుకొని ప్రతి నెలా కొంతడబ్బు యింటికి పంపుతూ వుండేవాడు.

అతని మీద తల్లిదండ్రులు మరొక పెద్దభారం పెట్టారు. అతని చెల్లెలికి యుక్త వయసు వచ్చినా పెళ్ళికాలేదు. పెళ్ళికి కనీసం యాభైవేలయినా వుండాలి. రోజు గడవడమే కష్టంగా వున్న తమ కుటుంబం ఎక్కడి నుంచి అంత డబ్బు తేగలదు? రామ్మూర్తికి ఒక మేనమామ వున్నాడు. అతను లౌక్యుడు. పెళ్ళిళ్ళ వ్యవహారాలలో అతనికి అపారమైన అనుభవం వుంది. అతను చెప్పిన ఉపాయం ఆ కుటుంబానికి నచ్చింది. రామ్మూర్తి కూడా అందుకు ఒప్పుకున్నాడు. ఒప్పుకోక తప్పలేదు. అతనికి మరో మార్గం కనిపించలేదు.

ఏడాదిపాటు వెతికి అనేక సంబంధాలు చూసి చివరకు రామ్మూర్తికి పెళ్ళి సంబంధం కుదిర్చాడు. అతని మేనమామ పెట్టిన షరతులన్నీ అవతల పెళ్ళికూతురు తరపున వాళ్ళు ఒప్పుకున్నారు. కట్నం సొమ్ము ముందే యిచ్చేశారు. ఆ డబ్బుతో నిర్విఘ్నంగా ముందు రామ్మూర్తి చెల్లెలికి పెళ్ళయింది.

ఆ తర్వాత రామ్మూర్తికి పెళ్ళి అయింది. తొలి రాత్రి గదిలో అడుగు పెట్టిన తర్వాత అతను సుమతిని చూశాడు. పెళ్ళికిముందు అతను ఆమెను చూడలేదు. అతని తరపు బంధువులు కాని, అతను కానీ – పెళ్ళి కూతురుకు ప్రాధాన్యత యివ్వలేదు. అసలు ఆమె గురించి ఆలోచించలేదు. అతని చెల్లెలి పెళ్ళికోసమే రామ్మూర్తి తలవంచాడు. వెళ్ళి చూడమన్నా అతను వెళ్ళలేదు. ఫొటో చూశాడు. పెళ్ళి పీటల మీద కూడా సరిగా చూడలేదు. ఇప్పుడు చూశాడు. 'ఫర్వాలేదు. లక్షణంగా వుంది' అని సంతృప్తి పడ్డాడు. ఆమె కన్నార్పకుండా తనకేసే చూస్తూ వుండటం అతనికి ఆశ్చర్యం కలిగించింది. ఏదో మాట్లాడాలనుకుంటున్నట్టు వుంది.

ఆ ఇల్లు చాలా యిరుకు. చుట్టాలతో కిక్కిరిసిపోయి వుంది. ఆ చిన్నగదిలో నెమ్మదిగా మాట్లాడినా పైకి వినిపించేలా వుంది. అసలు ఆ రెండు రోజులూ వాళ్ళు మాట్లాడుకోడానికి అవకాశం దొరకలేదు.

మూడో రోజు రాత్రి పెళ్ళి కూతురి ఇంట్లో – జడుస్తూ జడుస్తూ ఆమె నోరు విప్పింది. ''మీకో సంగతి చెప్పాలి'' అంది.

''మొన్న కూడా నువ్వు యిదేమాట నా చెవిలో చెప్పావు. చుట్టూ మనుషులే! అక్కడేం చెబుతావు! నేనే వద్దన్నాను'' అన్నాడు.

''ఇప్పుడు చెప్పనా?'' అంది.

''మీ బంధువు ఒకాయన వాళ్ళ తోటలోకి రమ్మన్నాడు. రేపు సాయంత్రం అక్కడికి వెళ్ళి మాట్లాడుకుందాం'' అన్నాడు.

ఆ మర్నాడు కొత్తదంపతులిద్దర్నీ బంధువుల యింటికి భోజనాలకు పిలిచారు. భోజనాలయిన తర్వాత వాళ్ళతో కలిసి తోటలోకి వెళ్ళారు. వాళ్ళతో వచ్చిన యిద్దరు మగవాళ్ళూ తోటమాలికి పనులు పురమాయిస్తూ వాళ్ళ పనిలో వాళ్ళు నిమగ్నమయ్యారు.

కొత్త దంపతులిద్దరూ మిగిలారు. ఒక మామిడి చెట్టు కింద కూర్చుని ''ఇప్పుడు చెప్పు!'' అన్నాడు రామ్మూర్తి.

అతనికి ఎదురుగా కూర్చుంది సుమతి. ''నేను చెప్పినదంతా విన్న తర్వాత మీరు ఆవేశపడకూడదు. అలాగ మాట యివ్వండి'' అంది నేల కేసి చూస్తూ.

క్షణం ఆలోచించి ''అలాగే! చెప్పు'' అన్నాడు.

''మావాళ్ళు మిమ్మల్ని మోసం చేశారు. నేను కూడా అందులో భాగం పంచుకోవలసి వచ్చింది. మిమ్మల్ని చూసిన తర్వాత మీకు నిజం చెప్పెయ్యాలనుకున్నాను. దానివల్ల నా బతుకు కష్టాల్లో పడుతుందని నాకు తెలుసు. అయినా సరే! మిమ్మల్ని మోసం చెయ్యడం నాకు యిష్టం లేదు.'' ఆగి అతని ముఖంలోకి చూసింది.

ఇదేదో ప్రమాదకరమైన వ్యవహారంలాగ వుందని అప్పటికి అతని బుర్రకెక్కింది.

''చెప్పమంటారా?'' అంది మళ్ళా.

''నేను నిన్నేమీ అడగలేదు. నీ అంత నువ్వే చెబుతున్నానన్నావు. మనిద్దరి మధ్య రహస్యాలుండడం మంచిది కాదు. చెప్పు'' అన్నాడు.

''నేను అప్పుడు ఇంటర్ చదువుతూ ఉండేదాన్ని. మా బంధువుల అబ్బాయి పట్నంలో ఇంజనీరింగు కాలేజీలో చదువుతున్నాడు. అతను వూళ్ళోకి వచ్చినప్పుడు విడవకుండా మా యింటికి కూడా వస్తూ వుండే వాడు. వాళ్ళు ఆస్తిపరులు. అతను నా వెనక తిరుగుతూ వుండడం చూసి మా వాళ్ళు సంతోషించారు. అతను నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకుంటాడని. ఎక్కువ ఖర్చు లేకుండా గొప్ప సంబంధం కుదురుతుందని ఆశపడ్డారు. మేం యిద్దరం కలిసి తిరగడానికి మా అమ్మా నాన్నా ఎప్పుడూ అడ్డు చెప్పలేదు. పైగా ప్రోత్సహించారు. అతని తరపు బంధువులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. పరిస్థితి చేయి జారిపోయిందని తెలిసిన తర్వాత రెండు పక్షాల వాళ్ళు కంగారుపడ్డారు. పెళ్ళిళ్ళ మార్కెట్టులో అతని రేటు మూడు లక్షలకు పైగావుంది. మా వాళ్ళు అందులో నాలుగోవంతు కూడా యిచ్చుకోలేరు. అందువల్ల అతనిపెద్దలు మా వాళ్ళకు కొంత నష్ట పరిహారం యిచ్చి నన్ను వదిలించుకున్నారు. నెల రోజులలో పెళ్ళి చేయాలని మా వాళ్ళు చాలా ప్రయత్నించారు. మాకు తగిన సంబంధాలు ఎక్కడా దొరకలేదు. నన్ను చదువు మానిపించేశారు. ఆ తొందరలో ఒక మధ్యవర్తి ద్వారా కొంత డబ్బు కట్టి ఒక ఆఫీసులో నాకు ఉద్యోగం



## నా అందం మరింత పెరిగింది....

బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్‌లలో హీరోయిన్లు లావెక్కకుండా సన్న పడడానికి తెగ కష్టాలుపడుతుంటే బాలీవుడ్ భామ కంగనా రనౌత్ మాత్రం ఏకంగా ఏడు కిలోల బరువు పెరిగింది! అందరూ బరువు తగ్గుతుంటే....నువ్వు ఏకంగా ఏడు కిలోలు పెరిగావు ఏమిటి? అని అడిగితే, దానికి ఆమె చెప్పిన సమాధానం ....

''బరువు పెరగడం వల్లనే నా అందం రెట్టింపు అయింది. నా బుగ్గలు మునుపటి కన్నా నునుపు తేలి నిగనిగలాడుతున్నాయి. ఇక నడుము కొలతలు, ఎద ఎత్తుల గురించి చెప్పనక్కర్లేదు. మీకో సంగతి తెలుసా? అభిమానుల కోరిక మేరకే బరువు పెరిగాను. బరువు తగ్గడం అంటారా? అది నా చేతుల్లో పనే! ఎప్పుడు కావాలంటే అప్పుడు తగ్గుతాను. ప్రస్తుతానికి పెరిగిన బరువుతో నేను హ్యాపీ...నా అభిమానులు హ్యాపీ...'' ఇన్ని మాటలు విన్న తరువాత ఇంక ఎవరైనా ఏదైనా అడగడానికి సాహసిస్తారా?

వేయించడానికి అన్ని ఏర్పాట్లుచేశారు. ఆ ఆఫీసు వాళ్లు ఖాళీగా వున్న ఒక పోస్టు నింపడానికి పర్మిషన్ కోసం పైకి రాశారట. నెలలోపున నాకు పోస్టింగు ఆర్డరు వస్తుందని చెప్పారు. ఈలోగా మీ సంబంధం కుదరడం, వెంటనే పెళ్లి అయిపోవడం అన్నీ జరిగిపోయాయి''.

రెండు కొబ్బరి బొండాలు పట్టుకొని తోటమాలి వాళ్లను సమీపించడంతో ఆమె ఆగిపోయింది.

యవ్వనంలో అడుగుపెట్టగానే తొలిమెట్టు దగ్గరే అతనికి అగ్నిపరీక్ష ఎదురయ్యింది. పవిత్రతకు, పాతివ్రత్యానికి ప్రాధాన్యత యిచ్చే కుటుంబంలోంచి వచ్చాడు అతను. అతనికి పాదాల కింద నేల కదులు తున్నట్లు. పెద్ద అగాధంలో పడిపోతున్నట్టు అనిపించింది.

కొబ్బరినీళ్లు తాగిన తర్వాత కొంత తేరుకొని ఆలోచించాడు. తను యిప్పుడు పెళ్ళి చేసుకోవాలనుకోలేదు. ఉద్యోగంలో నాలుగు డబ్బులు వెనకేసుకొని జీవితంలో స్థిరపడిన తర్వాత చేసుకోవాలనుకున్నాడు. కానీ తప్పనిసరి పరిస్థితులలో పెళ్లి చేసుకున్నాడు. దాని ఫలితం యిది.

త్వరగా ఒక నిర్ణయానికి వచ్చాడు. ఆమెతో చెప్పాడు. ఆమెకు ఎలాగూ ఉద్యోగం వస్తుంది కనక అందులో చేరిపొమ్మన్నాడు. తను ఒంటరి జీవితానికి అలవాటుపడి వున్నాడు. తనదారిన తాను వెళ్లిపోతానని చెప్పాడు.

అందుకామె అడ్డు చెప్పింది. ''మేం చేసిన తప్పుకు మీకెందుకు శిక్ష? మీరు తిరిగి పెళ్లి చేసుకోండి. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు విడాకులు పత్రం మీద నా సమ్మతి తెలియచేస్తూ సంతకం పెడతాను''.

''అదంతా తర్వాత. ఇప్పుడు కాదు. కట్నాలు, లాంఛనాల కింది మీ వాళ్లు యిచ్చిన డబ్బంతా నీకు నేను తిరిగి యివ్వవలసి వుంది... నా దగ్గర అంత డబ్బు లేదు. ఆ డబ్బే వుంటే దానితోనే నా చెల్లెలికి పెళ్లిచేసి వుండే వాణ్ణి. నాకు అసలు పెళ్లి చేసుకోవలసిన అవసరమే లేకపోయేది. ఇప్పుడు యివ్వలేకపోయినా కనీసం ఐదారేళ్లలో కూడబెట్టి నీ డబ్బు నీకిచ్చేస్తాను. చట్టరీత్యా అప్పుడు విడిపోవచ్చు'' అన్నాడు.

ఆఫీసులో అతిముఖ్యమైన పనివుందని వెంటనే చెయ్యకపోతే తన ఉద్యోగానికే ముప్పు వస్తుందని చెప్పి తల్లిదండ్రులతోను, తన తరపు బంధువులతోను అతను ఆ రాత్రి ఆ వూరు నుంచి బయలుదేరి వెళ్లి పోయాడు.

***

అతను పెట్టిన పదిహేనురోజుల సెలవులోను ఏడు రోజులు మాత్రమే వాడుకున్నాడు. మిగిలిన సెలవు కేన్సిల్ చేసుకొని డ్యూటీలో చేరి పోయాడు. ఉద్యోగ జీవితంలో అతనికి అపజయం అన్నది లేదు. ఒళ్లు వంచి కష్టపడి పని చెయ్యడమే కాక ప్రైవేటుగా చదివి ఇంటర్ పాసై తన క్వాలిఫికేషన్ పెంచుకున్నాడు. ఆ తర్వాత ఆ వూరినుంచి బదిలీ చేయించు కొని జిల్లా హెడ్ క్వార్టర్స్ ఆఫీసులో చేరాడు. అతనికి పెళ్లయిన తర్వాత కొన్నాళ్లకు అతని చెల్లెలు పార్వతి దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది.

''అన్నయ్యా! నెలలు నిండకుండా వదిన ప్రసవించింది. ఆడపిల్ల. నీకు తెలిసే వుంటుంది. ఆ తర్వాత ఏం జరిగిందో తెలుసా? నెల తిరక్కుండానే ఆ పసి పిల్లని ఎవరికో పెంపకానికి యిచ్చేసింది. నువ్వు వెంటనే కలగచేసుకో!''

ఆ ఉత్తరానికి జవాబు రాయలేదు రామ్మూర్తి. ఏ చర్యా తీసుకోలేదు.

అది జరిగిన మరో సంవత్సరానికి అతని స్నేహితుడు కేశవరావు కనిపించాడు. ''సుమతి నీ భార్య అని నాకు మొన్ననే తెలిసింది. మా అన్నయ్య పనిచేస్తున్న ఆఫీసులోనే ఉద్యోగం చేస్తోంది. చాలా బుద్ధిమంతురాలు. అలాంటి పిల్ల ఎక్కడో గాని వుండదని చెప్పాడు. ఇప్పుడు ఆమె మా పొరుగునే వుంటోంది. నువ్వు ఎప్పుడూ ఒకసారీ వచ్చినట్టు కనిపించదు. ఏమిటి సంగతి?'' అన్నాడు.

జవాబు చెప్పకుండా తప్పించుకున్నాడు రామ్మూర్తి.

అదిజరిగి అప్పుడే రెండేళ్లు కావస్తోంది. సుమతిని చాలావరకు మరచిపోయాడు. డిగ్రీ పరీక్షకు ప్రయివేటుగా కట్టాడు. ఏ బాదరబందీ లేకుండా నిశ్చింతగా చదువుకుంటున్న సమయంలో ఆకస్మికంగా సుమతి అతని ముందు ప్రత్యక్షమయ్యింది.

ఆలోచనలలోంచి తేరుకొని గడియారం కేసి చూశాడు. పది గంటలయ్యింది. వెనక్కి తిరిగి చూశాడు. సుమతి చాపమీద పడుకొని నిద్రపోతోంది. ఆమె ముఖం ప్రశాంతంగా వుంది. అతను ఎప్పటిలాగ గోడవారను మంచం వాల్చుకొని పడుకున్నాడు. అతనికి చాలాసేపటి వరకూ నిద్ర పట్టలేదు.

తెల్లవారురఝామున వంటగదిలో చప్పుడు విని లేచాడు. స్నానానికి వేణ్ణీళ్ళు సిద్ధంగా వున్నాయి. స్నానం చేసి వచ్చేసరికి ఒక ప్లేట్లో ఉప్మా వుంది. ఆరున్నరకే టిఫినూ, కాఫీ పూర్తయ్యాయి.

ఈవేళ కూడా అతనికి వంటగదిలో వెళ్లవలసిన అవసరం లేకపోయింది. పరీక్ష తేదీ దగ్గరకు వస్తోంది. పుస్తకాలు తీశాడు. కానీ చదువుతున్నది బుర్రకెక్కడం లేదు. తొమ్మిదిన్నర తర్వాత రామ్మూర్తి ఆఫీసుకు వెళ్లి పోయాడు. ఆ రోజు సాయంత్రం అతను ఆఫీసునుంచి తిరిగి వచ్చేసరికి సుమతి ఇంట్లో వుంది. వరండాలో ఒక సంచిలో కూరగాయలు, కొన్ని పొట్లాలు వున్నాయి. ఆమె ఆఫీసు నుంచి వచ్చేప్పుడు ఇంట్లోకి కావలసినవి కొనుక్కు వచ్చిందని అర్థమయ్యింది. ఆ మర్నాడూ అలాగే జరిగింది.

ఆమె పెట్టిన రెండు రోజుల గడువూ దాటిపోయింది. ఇంకా ఎక్కడా అద్దె యిల్లు దొరికి వుండదని సరిపెట్టుకున్నాడు. వారం రోజులు గడిచిన తర్వాత అతను ఆఫీసు నుంచి తిరిగి వచ్చేసరికి సుమతి యింట్లో లేదు. ఇల్లంతా ఖాళీగా కనిపించింది. సుమతి తెచ్చుకున్న సూట్‌కేసు, సంచి వగైరా ఆమె సామాగ్రి ఏదీ లేదు. తనతో మాట మాత్రమైనా చెప్పకుండా వెళ్లిపోయిందా? అనుకుంటూ పరధ్యానంగా టేబులు దగ్గరకు వెళ్లాడు. టేబులు మీద చీటి వుంది. తీసి చదివాడు.

''మీరు మీ వాచ్‌మేన్‌తో యిల్లు చూడమని చెప్పారట. అతను వచ్చి ఎక్కడో యిల్లు వుందని చెబితే చూడ్డానికి వెళుతున్నాను. మీరు వంటగది లోకి వెళ్లకండి. నేను తిరిగి వచ్చి వంట చేస్తాను. – సుమతి''.

వాచ్‌మేన్ మీద కోపం వచ్చింది రామ్మూర్తికి. తనకు చెప్పడం మానేసి యింటికి వచ్చిచెప్పడం ఏమిటి? తను ఒకలాగ అనుకుంటే యిది మరో లాగ జరిగింది. ఈ ఇల్లు విడిచి పెట్టి వెళ్లి పోయినట్టయితే తాను తిరిగి వచ్చి వంట చేస్తానని ఎందుకు రాసింది?

బట్టలు మార్చుకోడం కూడా మరచిపోయి టేబులు ముందు కూర్చుని ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి తలుపు తెరచుకొని సుమతి లోపలికి వచ్చింది.

''ఇల్లు చూడ్డానికి నువ్వెందుకు వెళ్లావు?'' అడిగాడు.

'' ఆ యిల్లు గలవాళ్లు తొందర పెట్టారట. ఒక గంటలో ఏదో ఒకటి చెప్పకపోతే ఆ ఇల్లు దొరకదని మీ వాచ్‌మేన్ చెబితే వెళ్లాను. ఆ ఇల్లు ఏం బాగాలేదు. దానికంటే యీ యిల్లే ఎన్నో రెట్లు బాగుంది'' అంది.

''ఆ యిల్లు నీ కోసం చూడమనలేదు'' అన్నాడు రామ్మూర్తి.

''మరెవరికోసం?''

''నా కోసమే చూడమన్నాను''.

''మరి యీ యిల్లో?''

## ధనానికి ప్రాధాన్యత ఇస్తే జరిగే పరిణామాలు



1947 వ సంవత్సరం నుంచీ కథలు అచ్చయినా వాటిల్లో చాలా వరకు నా వద్ద లేవు. వెతికితే 8-5-1996లో ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురించిన ఈ కథ దొరికింది. ప్రతి మనిషి జీవితంలోని మూడు ముఖ్యమైన ఘట్టాలలో వివాహం ఒకటి. పెళ్లి దాని పుట్టుపూర్వోత్తరాలు తెలిసిన నేను, అందులో కూడా డబ్బుకే ప్రాధాన్యత ఇస్తుండడం పట్ల ఒక పౌరునిగా సిగ్గుపడ్డాను. హార్దిక సంబంధాలు పోయి ఆర్థిక సంబంధాలు పెరిగి పోతున్న సమాజంలో ధనానికి ప్రాధాన్యత ఇచ్చినందువల్ల జరిగే పరిణామాల చిత్రణే ఈ 'ఏడడుగుల వ్యాపార బంధం' కథ. ఈ రచనా కాలానికి ముందున్న పరిస్థితులను బట్టి ఈ కథ పుట్టింది. ఇప్పటి సాఫ్ట్‌వేర్ జీతగాళ్ల జీవితాల్లోనూ అదే పరిస్థితి ఉందనో లేదా అధికమయిందనో పాఠకులు ఒప్పుకుంటారు.

–అంగర సూర్యారావు

ఫోన్ : 0891-2732274

''ఈ యింట్లో నువ్వు వుంటావు. ఈ యిల్లు నాకంటే నీకే ఎక్కువ అనుకూలంగా వుంటుంది''

''ఓహో! మీరు అలాగ ఆలోచిస్తున్నారా? నేను అలాగ అనుకోలేదు. ఆ యిల్లు వద్దని చెప్పేశాను. ఆ యిల్లుపోయింది. చూశారా. మీరు మనసులో మాట పైకి చెప్పకపోతే యిలాగే జరుగుతుంది. ఆగండి. ఇప్పటికే ఆలస్యం అయ్యింది'' అంటూ తొందరగా పెరట్లోకి వెళ్లి పోయింది.

ఆరాత్రి భోజనాలు అయిన తర్వాత వంటగది చక్కబెట్టుకొని ఆమె గదిలో అడుగుపెట్టేసరికి అతను రోజూలాగే గోడకేసి ముఖం తిప్పుకుని పుస్తకం చేత్తో పట్టుకు కూర్చున్నాడు.

''మీరు ఈ వేళ్టికి చదువు ఆపుచెయ్యలేరా?'' అంది.

''ఏమిటి?''

''పది రోజులనుండి ఎదురు చూస్తున్నాను. మీరేమైనా అడుగు తారేమోనని. మీరేమి అడగలేదు. అందుకని నేనే అడుగుతున్నాను. నేను వుండడం యిష్టం లేకపోతే సూటిగా చెప్పవచ్చు కదా?''

''అదేం కాదు'' అన్నాడు యిబ్బందిగా.

''ఏం కాదు? మీరు యీ యిల్లు వదిలి పెట్టి మరో అద్దె యిల్లు చూసుకోడంలో అర్థం ఏమిటి?''

''ఈ యిల్లు మా ఆఫీసుకు చాలా దూరం...''

''ఇప్పుడు మీరు వెళతానన్న యిల్లు యింతకంటే ఎక్కువ దూరం!''

''నాకు బస్సు పాసు వుంది. ఎంత దూరమైనా నాకు ఫర్వాలేదు. ఈ యిల్లు మీ ఆఫీసుకు చాలా దగ్గరగా వుంది...''

''అవును. నేను రోజూ మా ఆఫీసుకు నడిచివెళ్లి నడిచి వస్తున్నాను. మార్కెట్టు కూడా అందుబాటులో వుంది''.

''అందుకే దూరంగా వెళితే నీకు యిబ్బందని యీ యిల్లు నీకే విడిచి పెట్టేదామనుకున్నాను'' అన్నాడు.

ఆమె క్షణం ఆగి ''నిన్న నేను ఆఫీసుకు వెళుతున్న సమయంలో ఈ యింటి యజమానురాలు వచ్చారు. మీరు సంవత్సరం క్రితం యీ యింట్లో దిగినప్పుడు యీ పక్కగది అక్కర్లేదని చెప్పారట'' అంది.

''అవును. అద్దె తగ్గుతుందని ఆ గది విడిచి పెట్టేశాను''.

''ఇప్పుడు తీసుకుంటారేమో అని ఆవిడ అడగడానికి వచ్చింది. చూశాను. బాగుంది. అడ్వాన్సు యిచ్చేశాను. వాళ్ళు ఈ మధ్యాహ్నం గది ఖాళీ చేసి యిచ్చారు. ఇవేళ నేను ఆఫీసుకు సెలవు పెట్టి యింట్లోనే వున్నాను. ఆ గది సర్దుతున్న సమయంలో మీ వాచ్‌మేన్ వస్తే అతనితో వెళ్తాను''.

''ఏమిటి? ఈ పక్కగది నువ్వు అద్దెకు తీసుకున్నావా?'' అన్నాడు ఆశ్చర్యంతో.

''అవును. లోపలికి వెళ్లి చూడండి'' అంటూ రెండు గదులకూ మధ్యవున్న తలుపు తెరచింది.

కానీ అతను లేవలేదు. ఆ గదిలోకి వెళ్లి చూడలేదు. ఆమె తిరిగి అంది.

''ఇన్నాళ్లూ మనం యిద్దరం చెరో వూళ్లో వున్నాం. కనక మన గురించి ఎవరూ అంతగా పట్టించుకోలేదు. కానీ యిప్పుడు ఒకే వూళ్లో వుంటూ మనం యిద్దరం చెరో చోటా వుంటే ఏం జరుగుతుందో ఆలోచించండి. అందుకే యీ యిల్లు తీసుకున్నాను. పైనుంచి చూసేవాళ్లకు మనం కలిసి వున్నట్టు కనిపిస్తుంది. లోపలకు వచ్చిన తర్వాత మీ గదిలో మీరు వుంటారు. నా గదిలోకి నేను వెళ్లిపోతాను''.

మరి కొంతసేపు ఆగి చూసింది అతనేమైనా అంటాడేమో అని. కానీ అతను మాట్లాడలేదు. ఏదో దీర్ఘాలోచనలో పడినట్టు వున్నాడు.

''ఉద్యోగం చేస్తూ ఒంటరిగా వుండే ఆడవాళ్లకు ఎలాంటి సమస్యలు వస్తాయో నాకు నాలుగేళ్లలోనూ అనుభవం అయ్యింది. మీకు నిజం చెబుతున్నాను. మరొక సంవత్సరం ఆగితే ఆ వూళ్లోనే నాకు ప్రమోషన్ వచ్చి వుండేది. ఇక అక్కడ వుండడం నాకు యిష్టం లేక ఈ ట్రాన్సుఫర్‌కు ఒప్పుకుని వచ్చాను''.

కొన్ని క్షణాలు ఆగి తిరిగి చెప్పింది.

''పెద్దవాళ్లు మనిద్దరికీ పెళ్లిచేసిన తర్వాత నా కోరికమీదే మనం విడిపోయాం. సంవత్సరం క్రితం నా స్నేహితురాలు రజిత కనిపించిన తర్వాత నా ఆలోచనలో మార్పువచ్చింది. ఆమె చాలా పెద్దింటి పిల్ల. వాళ్ల పెద్దవాళ్లు కొన్ని లక్షలు ఖర్చు పెట్టి గొప్ప అమెరికా సంబంధం చూసి ఆమెకు పెళ్లి చేశారు. అది జరిగిన ఆర్నెల్లకు ఆ అబ్బాయికి యిదివరకే పెళ్లయ్యిందని తెలియడంతో ఆమె అక్కడి నుంచి వెనక్కి వచ్చేసింది. విడాకులు తీసుకొని తిరిగి పెళ్లిచేసుకుది. మా యిద్దరి వైవాహిక జీవితాలకూ కొన్ని పోలికలున్నాయి. ఆమె ఎంతో తెలివిగా తన జీవితంలో జరిగిన తప్పు దిద్దుకుంది. పెళ్లయిన నాలుగో రోజునే మనం యిద్దరం యిష్టపడి తీసుకున్న ఈ విడాకులు కోర్టులో చెల్లవు. కనక యిప్పుడు నేనేం చెయ్యాలి? చట్టరీత్యా విడాకులు తీసుకోవాలా? లేకపోతే మనిద్దరికీ పెద్దలు కట్టిన బంధం అలాగే కొనసాగనివ్వాలా? జరిగిన తప్పు దిద్దుకోడానికి అవకాశం వుందో లేదో మీరే ఆలోచించి చెప్పండి. నేను చెప్పవలసింది చెప్పాను. ఇక నాకు చెప్పడానికేమీ లేదు. నేను నా గదిలోకి వెళ్లిపోతున్నాను. ఇక మీరు పడుకోండి'.

ఆమె మధ్య తలుపు తెరచుకొని తన గదిలోకి వెళ్లిపోయి పడుకుంది. కానీ అతను పడుకోలేదు. దీర్ఘాలోచనలో పడిపోయి చాలాసేపుగా అలాగే కూర్చుండిపోయాడు. దూరాన్ని పన్నెండుగంటలు కొట్టిన చప్పుడు వినిపించింది. ఆ తర్వాత చాలాసేపటికి అతను ఒక నిర్ణయం తెలియ చెయ్యడం కోసం ఆమె గదిలోకి వెళ్లాడు.

★

## పరకాయ ప్రవేశం కోసం..



జన్మించిన క్షణం నుండి
ఊహ తెలిసే ముందు క్షణం వరకే
మనిషి మనిషిగా బ్రతికేది.
అలవోకగా అబ్బిన అలవాట్లు
వాతావరణ కాలుష్యంతో పాటు నడిచే
సమాంతర పురోగమనంలో
ఉనికిని మరచిన మనీషి
అస్థిత్వం కోసం ఆరాటపడుతుంటాడు.
పాతచొక్కా విడిచి కొత్త చొక్కా ధరించిన చందాన
జీవన దశలు మారిపోతుంటాయి.
మార్పు అనివార్యమైనపుడల్లా అతడు
ఊసరవెల్లి కావడం సహజమే మరి.
అవసరమైతే,
తన గుడ్లను మింగే పాము తానే అవుతాడు.
గత జన్మలోంచి మేల్కొని
వర్తమానంలో నటించడానికి సిద్ధమైనపుడు
తనదైన జీవితం సగమై వెక్కిరిస్తుంది.
తన పెద్దంతరానికి అభ్యంతరంగా
మరో తరం ఎదుగుతున్నపుడు
నటించే జీవితాన్ని నిజంచేసే భ్రమలో పడతాడు.
కష్టాలు, కన్నీళ్ళు, బాధ్యతలు, ఋణానుబంధాల
శృంఖలాల నుంచి
ఒడుపుగా తప్పించుకునే ప్రయత్నంలో
అంతర్దశకు చేరిన శిథిల గృహమవుతాడు ఆ మానవుడు.
తన వారికి నచ్చక,
పొరుగు వారికి కిట్టక
జీవన్మృతుడౌతాడు ఆ మహానుభావుడు.
ఒంటరిగా జీవనం ప్రారంభించి
ఈ జీవన్నాటక రంగంలో
తుంటరి తనంగా బ్రతుకీడ్చి
తన పాత్రను శాశ్వతం చేసుకుంటూ
కీర్తి శేషుడవుతాడు!!
మరణించి మరో పాత్రలో
పునఃప్రవేశానికి ఉద్యుక్తుడౌతూ..

-కొత్తపల్లి ఉదయబాబు
9396409548